సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

స్వర్ణాంధ్ర సాకారం కావాలంటే..



రెల్లివీధి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

- జగనే మళ్లీ సీఎం కావాలి
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- 42వ వార్డు రెల్లివీధిలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహణ



రెల్లివీధి 235 సచివాలయంలో అభివృద్ధి పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

తాటిచెట్లపాలెం : ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జీవీఎంసీ 42వ వార్డు రెల్లివీధి 235 సచివాలయం పరిధిలో శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ముందుగా 235 సచివాలయ పరిధిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించిన వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును స్థానిక కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించి, వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడారు. 235 సచివాలయ పరిధిలో ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా 5.20 కోట్లు, పరోక్ష నగదు బదిలీ ద్వారా 4.01 కోట్లు మొత్తం 9.21 కోట్ల లబ్ధిని ప్రజలకు అందజేసినట్లు తెలిపారు. అర్హులైన అందరు అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలకు పారదర్శకంగా లంచాలు, వివక్షకు తావు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా పలు పథకాల ద్వారా సుమారు రూ. 4,69,459 కోట్లు ప్రజలకు అందించడం గొప్ప విషయమని వాసుపల్లి తెలిపారు. గత ప్రభుత్వాల పాలనకు, నేటి జగనన్న పాలనకు వ్యాత్యాసం గమనించాలని, అర్హత గల చివరి వ్యక్తి వరకు సంక్షేమ పథకాల ఫలాలు అందాలనే ఉద్దేశ్యంతో పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందాలంటే, రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగాలంటే 2024లో జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని వాసుపల్లి తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వీసం రామకృష్ణ, వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్, జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, ఎస్. ప్రసాదరావు, శ్రీనివాసరావు, గణేష్, చిన్నా, పీలా గణేష్, శివ, చిన్న, కృష్ణవేణి, రమణమూర్తి, జయమ్మ, అలివేలు, జీవీఎంసీ ఏపీడీ పద్మావతి, అసిస్టెంట్ కమిషనర్ బాబూరావు, ఏఈ, సచివాలయ సిబ్బంది, సీహోలు, ఆర్పీలు, స్థానికులు పాల్గొన్నారు.



రెల్లివీధి సభలో జగనే మళ్లీ సీఎం కావాలని నినదిస్తున్న స్థానికులు

గౌరీ పరమేశ్వరుల ఉత్సవానికి ఆహ్వానం



వై.వి.సుబ్బారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న భీశెట్టి శ్రీనివాసరావు తదితరులు

అల్లిపురం : వేంకటేశ్వరమెట్టులోని శ్రీ వేంకట గౌరీ శంకర గ్రంథాలయం, గౌరీ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి నెల రోజుల పాటు గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆహ్వానించారు. శుక్రవారం వై.వి.సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పశ్చిమ నియోజకవర్గం కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్‌తో కలిసి గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి నరసింహమూర్తి (శ్రీను), కార్యదర్శి శరగడం మోహనరావు, కోరిబిల్లి శ్యామ్, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రిక అందజేసి ఉత్తరాంధ్రలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు గల ప్రాధాన్యతను వివరించారు.

ఇంద్రజాలంపై పుస్తక రచన అభినందనీయం




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు తదితరులు

దాబాగార్డెన్స్ : విశాఖకు చెందిన ఇండియన్ మ్యాజిక్ అకాడమీ నేతృత్వంలో వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం భీమవరానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు, మ్యాజిక్ స్టార్ డాక్టర్ బోస్ రచించిన 'ది రోల్ ఆఫ్ మ్యాజిక్ అండ్ మెజీషియన్స్ ఇన్ ది ఎర్లీ మూవీస్' పుస్తకాన్ని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు ఆవిష్కరించారు. అనంతరం ప్రముఖ అంతర్జాతీయ ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డికి అంకితమిచ్చారు. ఈ సందర్భంగా జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ చలన చిత్రాల తొలి రోజుల్లో ప్రేక్షకులను అలరించడానికి చేసిన అనేక ఇంద్రజాల ప్రదర్శనల్లో మెజీషియన్స్ ప్రాముఖ్యత, సహకారాన్ని అందరికీ తెలియజేయాలని ఒక పుస్తకాన్ని రచించడం డాక్టర్ బోసుకు మ్యాజిక్‌పై ఉన్న మక్కువను తెలియజేస్తుందన్నారు. విశాఖ ఫిలిం సొసైటీ ప్రధాన కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ మెజీషియన్‌గా 6600కు పైగా ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు కైవసం చేసుకున్న బీఎస్ రెడ్డికి ఈ పుస్తకం అంకితం ఇచ్చిన రచయిత బోసును అభినందించారు. రచయిత డాక్టర్ బోసు మాట్లాడుతూ తాను ఎన్నో రచనలు చేసినప్పటికీ ఈ పుస్తకంలో పొందుపరిచిన అంశాలు తనకు ఎంతో సంతృప్తినిచ్చాయన్నారు. కార్యక్రమంలో రంగసాయి నాటక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బాదంగీర్ సాయి, మెజీషియన్స్ అమర్నాథ్, షేక్ అన్వర్ బాషా, సుదర్శన్, రవితేజ, విజయకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ దీపావళితో పర్యావరణానికి రక్ష



దీపాలు వెలిగిస్తున్న సచివాలయ సిబ్బందితో కార్పొరేటర్ వసంతలక్ష్మి తదితరులు

అల్లిపురం : స్వచ్ఛ దీపావళితో పర్యావరణానికి రక్ష అని 33వ వార్డు కుమ్మరవీధి సచివాలయం సిబ్బంది నినదించారు. ప్రతి ఒక్కరు దీపావళిని టపాసుల రహిత దీపావళిగా జరుపుకోవాలని వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి సూచించారు. శుక్రవారం సాయంత్రం కుమ్మరవీధి సచివాలయం ఆవరణలో రంగు రంగుల ముగ్గులు తీర్చిదిద్ది, దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆమె పాల్గొని వార్డు ప్రజలు స్వచ్ఛ దీపావళి జరుపుకోవాలని కోరారు. ఈ సందర్భంగా స్వచ్ఛ్ దీపావళి సంతకం క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు, ఆర్పీలు, ఆశ వర్కర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పాల శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



కుమారికి వైఎస్సార్ బీమా అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి తదితరులు

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు పరిధిలో నివసిస్తున్న కంది సూరిబాబు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు బొర్రా శ్రీనివాసరెడ్డి సూరిబాబు భార్య కుమారికి వైఎస్సార్ బీమా నగదులో రూ.10 వేలు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ పుష్పరాణి, గృహ సారథులు పి.సూర్య, పీలా మహేశ్వరరావు, బంటుపల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ వైద్యులకు ప్రశంసలు



కేజీహెచ్ వైద్యులను అభినందిస్తున్న దక్షిణాఫ్రికా యువకుడు

మహారాణిపేట : తనకు కేజీహెచ్ వైద్యులు విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారని పేర్కొంటూ సర్జరీ యూనిట్‌ను దక్షిణాఫ్రికాలోని స్వాజిలాండ్‌కు చెందిన ఎమ్మెల్యేమూలి (mlamuli) అనే యువకుడు వైద్యులను ప్రశంసిస్తూ లేఖ అందజేశాడు. ఏయూలో ఎంఏ ఎకనామిక్స్ చదవేందుకు వచ్చిన అతను ప్రేగు సంబంధిత అనారోగ్యానికి గురయ్యాడు. ఈ ఏడాది అక్టోబర్ 9న కేజీహెచ్‌లో చేరిన అతనికి ఆరో యూనిట్ వైద్యుడు డాక్టర్ ఎస్.సుబ్రహ్మణం శస్త్ర చికిత్స చేశారు. కోలుకున్న ఆ యువకుడు తనకు ఎంతో సహకరించిన వైద్యులను శుక్రవారం కలిసి వారికి కృతజ్ఞతలు తెలిపాడు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు



మేయర్‌ను సత్కరిస్తున్న బ్రహ్మకుమారి రామేశ్వరి తదితరులు

దాబాగార్డెన్స్ : సమాజ చైతన్యానికి వారధులుగా పనిచేసే జర్నలిస్టుల జీవితాల్లో నిత్యం వెలుగులు విరజిమ్మాలని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తూ ఈ దీపావళిని జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు జరుపుకోవాలన్నారు. విశ్వభారత్ స్వచ్ఛంద సేవా సంస్థ ఎండీ బి. రమేష్ మాట్లాడుతూ విశాఖ నుంచి రాష్ట్ర బృందంగా న్యూఢిల్లీ బాలోత్సవానికి హాజరవుతున్న బాల కళాకారులను అభినందించారు. బ్రహ్మకుమారి రామేశ్వరి మాట్లాడుతూ సనాతన సంప్రదాయాలు, ఆచారాలను పండుగల రూపంలో జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా మేయర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, కొరియోగ్రాఫర్ నాగరాజ్ పట్నాయక్, సంఘమిత్ర సేవా సంస్థ సారథి సూరిబాబు, కళా సంస్థల ప్రతినిధులు బాదంగీర్‌సాయి, వఝ్రె నాంచారయ్య, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

యువతికి ఆశ్రయం



మెంటల్ కేర్ ఆస్పత్రి నుంచి అనితను తీసుకు వస్తున్న జ్యోతిర్మయి

అల్లిపురం : మానసికంగా బాధ పడుతున్న అనిత అనే యువతిని గత ఏడాది ఏప్రిల్‌లో ఏయూటీడీ టీఎస్ఆర్ నిరాశ్రయ వసతి గృహం సిబ్బంది చికిత్స నిమిత్తం చినవాల్తేరు మానసిక వైద్య శాలలో చేర్పించారు. ఆమె ఆరోగ్యం మెరుగుపడటంతో శుక్రవారం ఆమెను డిశ్చార్జి చేశారు. దీంతో ఆమెకు టీఎస్ఆర్ ఏయుటీడీ, జీవీఎంసీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి ఆశ్రయం కల్పించారు.

క్లినికల్ ట్రయల్స్ నిర్వహణలో నిబంధనలు పాటించాలి



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడానికి నిబంధనలు, నైతిక పద్ధతులు ఉన్నాయని, వాటిని తప్పకుండా పాటించాల్సిన బాధ్యత ఉందని అదనపు డీఎంఈ, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. శుక్రవారం ఏఎంసీ కాలేజీ ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన క్లినికల్ ప్రాక్టీసెస్ వర్క్‌షాపును ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వైద్యులు వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. కాగా ఆన్‌లైన్ వర్క్‌షాపులో పాల్గొనేందుకు దాదాపు 600 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఫార్మకాలజీ విభాగం హెచ్‌వోడీ డి.శ్యామల, ప్రొఫెసర్ డాక్టర్ కె.హిమబిందు, ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకుడు డాక్టర్ మాధవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



36వ వార్డు జామియా మసీదు వద్ద ఎమ్మెల్యే వాసుపల్లిని సత్కరిస్తున్న లబ్ధిదారులు

అల్లిపురం : సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం 34వ వార్డు అచ్చియ్యమ్మపేట, 36వ వార్డు జామియా మసీదు వద్ద ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. అచ్చియ్యమ్మపేట వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 31వ వార్డు పరిధి ఎల్లమ్మతోట ఎండోమెంట్ ఇష్యూ క్లియర్ చేయాలని స్థానికులు వినతిపత్రం అందించారు. తక్షణమే ఎమ్మెల్యే ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వార్డు ప్రెసిడెంట్లు, మండల అధ్యక్షుడు దొడ్డి బాపు ఆనంద్, సిటీ సెక్రటరీ ఆదివిష్ణు, నాయకులు పచ్చిరిపల్లి రాము, లండా రమణ, వాసుపల్లి నారాయణరావు, సూరిబాబు, దూడ అప్పారావు, గద్దిపిల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు. 36వ వార్డులో పట్నాల దివాకర్‌కు వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ఉచితంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నగదు చెల్లించడంతో ఎమ్మెల్యే వాసుపల్లికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రజల నుంచి వినతిపత్రాలు తీసుకుని పరిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కోడూరు అప్పలరత్నం, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, టీకే ప్రసాద్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆళ్ల శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, చిన్ని, శ్యామ్, వాసు, రామరాజు, అచ్యుత్, ధనరాజ్, ముస్లిం నాయకులు రఫీ, లడ్డు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ దేవాలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ భాస్కరరావు

జగదాంబ : పూర్ణామార్కెట్ వద్ద ఉన్న శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవాలయంలో శుక్రవారం శాశ్వత అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ప్రారంభించారు. తొలుత దేవాలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ భాస్కరరావు పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. దేవాలయ ఈవో శేఖర్‌బాబు, చైర్మన్ నాయిని మల్లిబాబు, ధర్మకర్తలు బత్తిన మంగరాజు, ఖండేపల్లి వరలక్ష్మి, యల్ల రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలు సహించం



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు పట్టికను పరిశీలిస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి

మహారాణిపేట: రేషన్ సరకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఈ.లక్ష్మీరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాశరావుతో కలిసి ఆయన నగరంలోని పలు రేషన్ డిపోలు, రేషన్ సరకుల పంపిణీ వాహనాలను తనిఖీ చేశారు. ముందుగా కంచరపాలెం ఏరియాలో రేషన్ పంపిణీ వాహనాన్ని తనిఖీ చేసి, బియ్యం స్టాక్ ఎంత వచ్చింది, ఎంత పంపిణీ చేశారు? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం షీలానగర్‌లోని రేషన్‌డిపోను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మిందిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, కోడిగుడ్ల రిజిస్టర్ పరిశీలించారు. రిజిస్టర్ పరిశీలించగా 1800 కోడిగుడ్లు అధికంగా ఉన్నాయని, హెచ్‌ఎం వివరణ తీసుకుని పంపాలని డీఈవోను లక్ష్మీరెడ్డి ఆదేశించారు. మల్కాపురంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో హాజరు పట్టికను తనిఖీ చేశారు. అనంతరం వడ్లపూడిలో ఎంఎల్ఎస్ గొడౌన్‌ను తనిఖీ చేశారు. ఏఎస్‌వోలు జి.మురళీనాథ్, టి.కృష్ణ, సీడీపీవో నీలవేణి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఉమసుందరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్స్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



మూడు చెత్తబుట్టల విధానంపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ వసంతలక్ష్మి, జెడ్సీ శివప్రసాద్

అల్లిపురం : మూడు చెత్త బుట్టల విధానం అవలంబిద్దాం.. పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి పిలుపునిచ్చారు. ఆమె ఆధ్వర్యంలో శుక్రవారం వార్డులో బంగారమ్మమెట్ట సచివాలయం పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ శివప్రసాద్ పాల్గొని ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని అవగాహన చేపట్టారు. స్థానికులంతా మూడు చెత్తబుట్టలు తప్పనిసరిగా వినియోగించాలని కోరారు. రోడ్లు, కాలువల్లో చెత్త వేయరాదని తెలిపారు. తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను విడగొట్టి మూడు చెత్తబుట్టల్లో నిలువ చేయాలని, ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. మంచినీటిలో పెరిగే దోమల వలన డెంగ్యూ, మలేరియా, చికున్‌గునియా వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. పూల కుండీలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, ఫ్రిడ్జ్ ట్రే బాక్సుల కింద, కుండీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు హెల్త్ ఆఫీసర్, మలేరియా ఇన్స్‌పెక్టర్, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, ఆర్పీలు, పారిశుధ్య కార్మికులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

యుద్ధాన్ని ఆపాలి

సీతమ్మధార : పాలస్తీనాపై ఇజ్రాయెల్ తక్షణమే దాడిని ఆపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. యుద్ధాన్ని ఖండిస్తూ శుక్రవారం జీవీఎంసీ గాంధీ పార్కులో వామపక్ష పార్టీల నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ మాట్లాడుతూ పాలస్తీనా భూభాగాన్ని ఇప్పటికే ఇజ్రాయెల్ ఆక్రమించిందని, ఇది సరైంది కాదన్నారు. ఆర్‌కేఎస్‌వీ కుమార్, వామపక్ష పార్టీల నాయకులు బొట్టా ఈశ్వరమ్మ, ఎండీ బేగం, ఎం.సుబ్బారావు, దేవా, ఎస్‌కే రెహమాన్, వి.కృష్ణారావు, కె.వనజాక్షి పాల్గొన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
MAHINDRA ALFA DX DIESEL
BS VI 2022 MODEL AP39 UJ 5284
Cell : 99594 44203
43-9-226, Sri Priya Complex, Railway New Colony, VIZAG.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
ASHOK LEYLAND E COMET 1615
2020 MODEL AP39 TQ 4721
Cell : 99124 47672
D-5, 3rd Floor, Pavan Palace, Dwaraka Nagar, VISAKHAPATNAM.

కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించాలి



హాజరైన ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్‌వోలు



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్. చిత్రంలో డీఆర్‌వో మోహన్‌కుమార్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ లక్ష్మారెడ్డి

మహారాణిపేట : జిల్లాలో తప్పులు లేని సమగ్ర ఓటరు జాబితా రూపొందించాలని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. శుక్రవారం సాయంత్రం గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితాపై అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో సిరిపురం వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా డూప్లికేట్ ఓట్లను తొలగించే క్రమంలో జాగ్రత్త వహించాలన్నారు. ఒకే డోర్ నంబర్‌లో అధిక ఓట్లు ఉన్నా, ఒకరి పేరు మీద రెండు ఓట్లు ఉన్నా బీఎల్‌వోలు స్వయంగా ఆయా ఇళ్లకు వెళ్లి పరిశీలించాలన్నారు. అన్ని వివరాలు సరిపోయాయి అనుకున్నాకే ఓట్లను తొలగించాలని సూచించారు. బీఎల్వోలు ఓటు సవరణలు ఈఆర్వో ఆన్‌లైన్‌లో తప్పక అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ, మండల వారీగా ఉన్న సున్నా డోర్ నంబర్ ఓట్లు ఎన్ని గుర్తించారు, ఒకే ఇంటిలో పది మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న కేసులు, 100 సంవత్సరాలు పైబడిన వారి కేసులు ఎన్ని, పరిశీలించినవి ఎన్ని, ఇంకా పరిశీలించాల్సిన సంఖ్య తదితరాలపై తహసీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఆర్వో కె. మోహన్‌కుమార్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ లక్ష్మారెడ్డి, తహశీల్దార్లు, బీఎల్వోలు, సూపర్ వైజర్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు విస్తరించాలి



స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

మహారాణిపేట: స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల సేవలు దశ దిశలా విస్తరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. భారత్ స్కౌట్స్, గైడ్స్ జాతీయ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జేసీ చాంబర్‌లో ఆయనను విద్యార్థులు కలిసి ఆవిర్భావ బ్యాడ్జిలను జేబుకు అతికించి అభినందనలు తెలిపారు. ఈ విభాగంలో ఈ ఏడాది ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ విద్యతో పాటు స్కౌట్స్, గైడ్స్ లక్ష్యాలు, ఆశయాలు చేరువయ్యేందుకు ప్రతి విద్యార్థి ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. 1950, నవంబర్ 7న ఈ సంస్థ ఆవిర్భవించిందన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ క్రమ శిక్షణ, అకుంఠిత దీక్షకు మారు పేరైన స్కౌట్స్, గైడ్స్ రంగంపై విద్యార్థులను ప్రభావితం చేయాల్సిన గురుతర బాధ్యత తల్లిదండ్రులు, సమాజంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ యూత్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.హరీష్‌కుమార్, ఏఎస్‌వో షరీఫ్, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం విశాఖ జిల్లా కన్వీనర్ కె.ఎల్లయ్య, గైడ్ కెప్టెన్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

దాబాగార్డెన్స్ : విశాఖ జిల్లా గౌడ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం గౌడ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ సంఘం తరఫున సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్ గౌడ సంఘం కన్వీనర్ కామన వెంకట సుబ్బారావు నూతన కార్యవర్గ సభ్యులు, ఉత్తరాంధ్ర గౌడ సంఘాల సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మార్గాన రామారావు, ప్రధాన కార్యదర్శి దీవి నారాయణ, ఏవీఎస్ఎన్ మూర్తి, మట్టా ఆనందరావు, యేకుల మధు, మార్గాన చినబాబు, రేలంగి పెదబాబు, రేలంగి చినబాబు, మట్టా నాని, మార్గాన విజయ్‌కుమార్, మార్గాన చిన్నయ్య, కొయ్య సత్యనారాయణ, చలమోలు శ్రీనివాసరావు, యరకల భవాని, మార్గాన ఉమశ్రీ, నారగాని రామకృష్ణ, పరీదుల శ్రీనివాసరావు, దాలయ్య, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్లు భరత లక్ష్మి, వై. భవాని (విజయనగరం), ఎం ఉమాశ్రీ, ఎం. చిన్నబాబు, ఇ. మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010810033, 7075989701
Office mail : sakshiadvtvsp@gmail.com